క్లుప్తంగా

యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్–2లో వెలసిన యోగ సిద్ధాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రధానార్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచి స్వామికి పూజలు నిర్వహించారు. విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణ పఠించారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో మాఘ మాస శుద్ధ విదియ మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

నేడు ఆతిథ్య పరిశ్రమపై సదస్సు

మురళీనగర్: నగరంలోని గ్రాండ్ స్పేస్ ఎలిజెంట్ హోటల్‌లో బుధవారం హాస్పిటాలిటీ ఇండస్ట్రీ – అకాడమియా కాన్‌క్లేవ్ సదస్సు నిర్వహించనున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని ఆతిథ్య పరిశ్రమ ప్రాధాన్యత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై పలువురు హోటల్ మేనేజ్‌మెంటు సంస్థలు, స్టార్ హోటల్స్ ప్రతినిధులతో చర్చిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్, హెచ్‌ఆర్ ఏపీపీ సంయుక్తంగా ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ వైర్లతో కష్టాలు



నక్కవానిపాలెంలో ప్రమాదకరంగా వైర్లు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెం గ్రామంలో విద్యుత్ వైర్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న సందుల్లో ఎక్కడ చూసిన వైర్లు వేలాడుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యావరణం.. సత్య నినాదం



మొక్కల సంరక్షణలో సత్యనాథం



పక్షులకు ఆహారం పెడుతూ..

మురళీనగర్: రాళ్లపల్లి సత్యనాథం...ఈ పేరు వినగానే మానవతకు మారు పేరుగా చెపుతారు. ఆయన ఎనిమిది పదులు వయసులోనూ నేటి తరం యువతకు తీసుపోని విధంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాదు ప్రజల్లో నడక ప్రాధాన్యత, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణపై నిరంతరం అవగాహన కల్పిస్తూ స్ఫూర్తి నింపుతున్నారు.

20 ఏళ్ల అనుబంధం

మురళీనగర్‌కు చెందిన రాళ్లపల్లి సత్యనాథం రైల్వే శాఖలో ఉన్నత పదవిలో పదవీ విరమణ చేశారు. ఇరవై ఏళ్లుగా ఇక్కడ నివశిస్తున్నారు. ఆయనకు మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్‌తో అనిర్వచనీయమైన అనుబంధం ఏర్పడింది. తన శాయశక్తులా వాకర్స్ క్లబ్‌కు సేవలు అందించడమే కాకుండా వాకర్స్ పార్కు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన దినచర్య కూడా వాకర్స్ పార్కులో వ్యాయామంతో ప్రారంభమవుతుంది. ఉదయం ఇంటి పనులు పూర్తయిన తర్వాత వాకర్స్ పార్కుకు వచ్చి మూగజీవాలు, మొక్కల సేవలో తరిస్తారు. ఇరవై ఏళ్లుగా ఆయన ఇది కొనసాగిస్తున్నారు.

పచ్చదనం పరిరక్షణకు ప్రాధాన్యత

ఆయన పచ్చదనం పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తారు. బోన్సాయ్ వృక్షాలను ఆయన సతీమణి పేరున ఇక్కడ ఏర్పాటు చేశారు. రీడింగ్ రూము నిర్మించారు. ప్రతి రోజు వచ్చిన తర్వాత పార్కును విడిచి వెళ్లినప్పుడు మొక్కలకు నమస్కరిస్తారు. హుద్‌హుద్ తుపాను సమయంలో మొక్కల విధ్వంసాన్ని చూసి విలపించిన ఆయన వాటి పునరుద్ధరణకు విశేష కృషి చేశారు. ప్రతి రోజు పార్కుకు రాగానే యోగా, చిన్నపాటి ఆసనాలు వేస్తారు. అనంతరం కాకులు, ఉడతలు వంటి మూగ జీవాలకు ఆహారం, నీరు అందిస్తారు. పార్కు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొంటారు. మొక్కల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా అంతర్జాతీయ అవార్డులను ఆయన అందుకున్నారు. ప్రస్తుతం వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీగా నిరంతరం బిజీగా పని చేస్తున్నారు. ఇంతటి వయసులోనూ తరగని చైతన్యనం ఆయన విజయరహస్యమని చెప్పుకోవచ్చు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత వాకర్స్ క్లబ్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

మన భవిష్యత్తు జగనన్నే



మాట్లాడుతున్న ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు



మాట్లాడుతున్న చిక్కాల రామారావు



పాల్గొన్న కన్వీనర్లు, గృహసారథులు

మద్దిపాలెం : సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే విజయ సారథులని, జగనన్నే మన భవిష్యత్తు అని రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గంలో– 49, 50, 51, 53, 54, 55వ వార్డులకు సంబంధించి మంగళవారం మాధవధార 51వ వార్డులోని మాధవస్వామి కల్యాణ మండపంలో జేసీఎస్ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మా భవిష్యత్తు నువ్వే జగన్ అనే నినాదంతో ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదే అని కేకే రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీకి చేరువయ్యేలా చేయాలన్నారు. రాష్ట్ర జేసీఎస్ ఉత్తరాంధ్ర కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఏకమై సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై దాడి చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల విధులపై అవగాహన కల్పించి కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చిక్కాల రావు, పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజనీ, యూత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాస్, మండల కన్వీనర్లు కృష్ణారావు మాస్టర్, సీనియర్ నాయకులు మాధవీవర్మ, పేడాడ రమణికుమారి, మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు సంక్షేమం



బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కేకే రాజు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట : వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అర్హత గల ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 25వ వార్డు మధురానగర్ సచివాలయం పరిధి రాజేంద్రనగర్ ప్రాంతంలో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఏ గడపకు ఏయే పథకాలు అందాయో వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మొదటి ఏడాదిలోనే 95 శాతానికి పైగా నెరవేర్చారన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు అందేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి గాంధీజీ కలలను నిజం చేశారని తెలిపారు. ప్రజల కోసం అనుక్షణం పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరి చల్లని దీవెనలతో 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ నూకరాజు, రాయుడు శ్రీను,పైడి రమణ, కిరణ్‌రాజు, షేక్ బాబ్జి, 25వ వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, పోతుబంతి హరికృష్ణ, సమ్మెట్ల వెంకటేష్, అప్పన్న, నాగార్జున, సన్నీ, శంకర్, అశోక్ సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల స్వాగత సభలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎదగాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన స్వాగత సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉపాధి కోసం ఎదురు చూడకుండా అవకాశాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. దీనికి అవసరమైన వ్యవస్థను విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. క్రమ శిక్షణకు వర్సిటీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్లేస్‌మెంట్ సంఖ్య పెరగడం, విద్యార్థులు అధిక వేతనాలతో ఉద్యోగాలను సాధించడం చూస్తున్నామన్నారు. ఆర్ట్స్ కళాశాలకు పునరుజ్జీవనం, పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కళాశాల పరిధిలో 97 శాతానికి పైగా సీట్లు భర్తీ కావడం దీనికి నిదర్శనమన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఆరు విధాలైన స్టార్టప్ ఎకోసిస్టంలను అభివృద్ధి చేసిన విధానాన్ని వివరించారు. 21 శతాబ్దపు నైపుణ్యాలను యువతలో పెంచేలా ప్రత్యేకంగా నైపుణ్య కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం, ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం దళిత సంఘాలతో కలిసి నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 25 శాతం ఉన్న దళితులకు పది లక్షల కోట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. బడ్జెట్‌లో మార్పులు చేసి ఎస్సీ, ఎస్టీలకు రావాల్సిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.1.60 లక్షల కోట్లు ఉపాధి హామీ పథకానికి మంజూరు చేయాల్సి ఉండగా రూ.60 వేల కోట్లకు కుదించి పనిదినాలు వంద రోజుల నుంచి 50కి తగ్గించారన్నారు. ఎస్టీ,ఎస్సీలకు నిధులు మంజూరుకోత విధిస్తూ బడా బాబులకు రూ.10 లక్షల కోట్లు రుణ మాఫీ చెయ్యడం దారుణమన్నారు. బడ్జెట్‌లో నిధుల కోసం ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గురుమూర్తి, సుబ్బన్న, చిరంజీవి, రాంబాబు, పతివాడ రాంబాబు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో జోన్–5 పబ్లిక్‌హెల్త్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తడి–పొడి చెత్త, ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ ఆర్‌వీజీ కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు తడి–పొడి చెత్తను వేరు చేసి పారిశుద్య సిబ్బందికి అందించాలని, ప్రమాదకర ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని తెలిపారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలు, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఆయాలకు, ఉపాధ్యాయులకు ఆయన కోరారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా పరిసరాల్లో మొక్కలు నాటేలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, కార్పొరేటర్ రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం ఆర్. శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, సచివాలయ శానిటరీ సెక్రటరీ నళిని, అడ్మిన్ అశోక్, ఉపాధ్యాయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన యువకుల విన్యాసాలు





యువత విన్యాసాలు

సీతమ్మధార : సాగర తీరంలో వైఎంసీఏ ఎదురుగా మంగళవారం ఉదయం యువకుల విన్యాసాలు అబ్బురపరచాయి. ఉదయం వాకింగ్‌కు వచ్చే వారికి వీరు చేసిన విన్యాసాలు ఆనందాన్ని కలిగించాయి. రోజూ ఓ గంట పాటు ఇలా ఫిట్‌నెస్ కోసం యువకులు శ్రమిస్తున్నారు.

విద్యార్థులకు ప్రాక్టికల్ లెర్నింగ్



ప్రాక్టికల్ లెర్నింగ్‌లో పాల్గొన్న సివిల్ ఇంజినీర్ విద్యార్థులు

సీతంపేట: అవకాశాలు అందిపుచ్చుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అన్నారు. కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ లెర్నింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కళాశాల మేనేజ్‌మెంట్ ఎంతో కృషి చేస్తోందన్నారు. దానిలో భాగంగా ఈ ప్రాక్టికల్ లెర్నింగ్ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠ్యాంశాలుగా నేర్చుకున్న వాల్ కనస్ట్రక్షన్‌ను ప్రాక్టికల్‌గా చేసి అందులో మెళకువలు తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్యార్థులు చాలా అవసరమన్నారు. క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విభాగాధిపతి జి.ఆర్.టి.నాయుడు మాట్లాడుతూ వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత జోడిస్తే విద్యార్థుల భవిష్యత్ ఇంకా బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12 లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల మంజూరు

మహారాణిపేట: లోకల్ లెవెల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సమావేశం జరిగింది. లీగల్ గార్డియన్‌షిప్‌కు సంబంధించి అంశాలు, ఆరోగ్య బీమా పథకం అమలు, ప్రణాళికను జిల్లా విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకురాలు జె.మాధవి వివరించారు. దివ్యాంగులకు లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్‌ను త్వరితగతిన మంజూరు చేయడానికి, అట్టడుగు స్థాయిలో ప్రభావంతమైన పనితో గరిష్ట స్థాయికి చేరుకోవడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని ఆమె తెలిపారు. లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల కోసం 14 దరఖాస్తులు రాగా.. వాటిలో 12 దరఖాస్తులకు అర్హత ఉన్నాయని గుర్తించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. త్వరలోనే లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్లు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.హరికృష్ణ, ఆశాదీప్ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు పి.ఎం.కె.రావు, ది ఎబిలిటి పీపుల్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ దిలీప్ పాత్రో, తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగులు సహాయ సహకారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1800 425 8911లో సంప్రదించవచ్చు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీఅసంగానంద ఆశ్రమంలో పునర్నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ ప్రారంభోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే శ్రీశివలింగ నందీశ్వర, ధ్వజ స్తంభ శిఖర కలశ ప్రతిష్టా కార్యక్రమాలు మంగళవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, మండప దేవతా ఆవాహన, హోమాలు, మహానైవేద్యం, శివ, నంది, ధ్వజ స్తంభ యంత్రములకు సుగంధ ద్రవ్యములతో జలాధివాసం జరిపారు. బుధవారం సౌభాగ్యలక్ష్మి కుంకుమ పూజ, విగ్రహ మూర్తులకు, ప్రతిష్టా యంత్రములకు భక్తులతో పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు.

పబ్లిక్ డిమాండ్

ఫుట్‌పాత్‌లపై నడిచేదెలా?



నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో ఆక్రమణకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55వ వార్డులు కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ వంతెన కూడలి కాలిబాటలో వ్యాపారాలు చేస్తుండడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఊర్వశికూడలి నుంచి కంచరపాలెం రైతుబజారు, తాటిచెట్లపాలెం వెళ్లే రహదారుల్లో ఫుట్‌పాతలు దుకాణాలతో ఆక్రమణకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండడం నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

–బి.రమణమూర్తి. కంచరపాలెం

యూనియన్ బ్యాంక్ రుణమేళాకు విశేష స్పందన

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని యూనియన్ బ్యాంక్‌లో మంగళవారం నిర్వహించిన రుణ మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ అధికారి ఐ.ఎస్.ఎస్.మూర్తి పాల్గొని 28 మంది లబ్ధిదారులకు రూ.5 కోట్లు రుణం మంజూరు చేసి వాటికి సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ నుంచి అతి తక్కువ వడ్డీ రేట్లతో గృహ, వివాహ, విద్య, వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. విదేశీ విద్య కోసం ఎలాంటి హామీ లేకుండా రూ.40 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశ్విన్‌నాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మానిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

తిరుగులేని ‘శశి’

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీ చైతన్య హవా

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకడామీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎస్.సిద్ధార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్ నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్.మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎస్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 462 మంది హాజరు కాగా 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.